సాక్షి చిత్తూరు

బుధవారం । 28 । ఆగస్టు । 2024



వైభవం.. ఉట్లోత్సవం..

కార్వేటినగరం వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్లోత్సవం ఘనంగా జరిగింది. - 8లో



టపాకాయల సీజ్

అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7 లక్షల విలువ చేసే టపా కాయలను శ్రీరంగరాజపురం పోలీసులు సీజ్ చేశారు. - 8లో



'చౌక'గా పాలిష్..!

ఉమ్మడి జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా కర్ణాటకలోని బంగారుపేటకు, అక్కడి నుంచి విదేశాలకు తరలిపోతున్నాయి. - 8లో



ఎవరు వచ్చి వెళ్తున్నారో నమోదు చేయాలి



ఆస్పత్రిలో ఉన్న పేషెంట్ కోసం ఎవరు వస్తున్నారో? ఎవరు వెళ్తున్నారో? ప్రతి ఒక్కరి ఐడెంటిటీ నమోదు చేయాలి. అందుకు అవసరమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలి. అప్పుడే వైద్యులకు భద్రత ఉంటుంది. లేదంటే ఆస్పత్రికి ఎవరు వస్తున్నారో.. వెళ్తున్నారో తెలియని దుస్థితి. పేషెంట్ తాలుకా అటెండర్స్ విషయంలో చాలా కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి. - భావన, వైద్య సంఘ నాయకురాలు, చిత్తూరు

ప్రజల మద్దతు అవసరం



కోల్‌కతా సంఘటన దురదృష్టకరం. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా డాక్టర్లు పయత్నిస్తున్నారు. అందుకు ప్రజల సహకారం కూడా అవసరం. డాక్టర్లు భయం లేకుండా ఎప్పుడైతే వైద్యం అందజేస్తారో రోగులకు తగిన న్యాయం జరుగుతుంది. దీనిని గమనించి ప్రజలు, ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉంది.

- పూర్ణకళ, వైద్యసంఘ నాయకురాలు, చిత్తూరు

దోషుల్ని తప్పిస్తే ఊరుకోం



కోల్‌తా వైద్య విద్యార్థినిపై దాష్టీకం అత్యంత దారుణం. కొందరు దోషుల్ని తప్పించడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. నిందితుడు సంజయ్ పొంతన లేని సమాధానాలిచ్చాడని తెలిసింది. ఎలాగైనా కేసును నీరుగార్చి అసలు నిందితులను తప్పించే పనిలో ఉన్నారు. ఇదే జరిగితే వైద్య సమాజం చూస్తూ మాత్రం ఊరుకోదు.

- అనురాగ్, జూనియర్ డాక్టర్, చిత్తూరు

ఆర్‌ఎంపీ వైద్యం తీస్తోంది ప్రాణం



పలమనేరు సమీపంలోని నల్లగుట్లపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థినికి జ్వరం రావడంతో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఓ ఆర్‌ఎంపీ వద్దకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అక్కడ సెలైన్ పెట్టి అందులో యాంటిబయాటిక్స్ వేశారు. అయితే జ్వరం మరింత ఎక్కువై బాలిక రెండ్రోజుల కిందట మృతి చెందింది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం కారణంగా ఆ తల్లిదండ్రులు ఒక్కగానొక్క కుమార్తెను పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఘటనలు జరిగినప్పుడు నానా హడావుడి చేసే వైద్యశాఖ అధికారులు ఆపై పట్టించుకోరు. దీంతో ఆర్‌ఎంపీలు సైతం వారి సంఘాల అండతో బాధితులకు నష్టపరిహారాలు చెల్లించుకుంటూ సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఆరువేల దాకా ఆర్‌ఎంపీలు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- మాఫియాలా ఆర్‌ఎంపీలు, మెడికల్ దుకాణాల నిర్వాహకులు
- పేదల ప్రాణాలతో చెలగాటం
- అద్దెకు దొరుకుతున్న ఫార్మసి సర్టిఫికెట్లు
- మెడికల్ దుకాణం, పక్కనే ఆర్‌ఎంపీ వైద్యం
- కొందరు ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ క్లినిక్‌లకు రోగులను రెఫర్ చేస్తున్న ఆర్‌ఎంపీలు
- ఎంఆర్‌ఐ, స్కానింగ్, బ్లడ్ టెస్ట్‌లకు రెఫర్ చేస్తున్న వైనం
- గ్రామాల్లో భారీగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు
- పట్టించుకోని జిల్లా వైద్యశాఖ

పలమనేరు: దేశాన్ని కుదిపేస్తున్న ఉగ్రవాదం, మాఫియా రంగాలతో సమానంగా వైద్యం కూడా ఒక మాఫియాలా మారింది. వైద్యో నారాయణో హరీ అని వెళ్లిన గ్రామీణ రోగులకు ఆర్‌ఎంపీల క్లినిక్‌లు చావుకు చిరునామాలుగా మారుతున్నాయి. పల్లె జనం అమాయకత్వాన్ని అవకాశంగా మలుచుకుని డబ్బు గుంజడమే పనిగా పెట్టుకున్నారు జిల్లాలోని కొందరు ఆర్‌ఎంపీలు. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఏకంగా 6 వేలమంది ఆర్‌ఎంపీలు ఉన్నారంటే అతిశయోక్తి కదా ! మెడికల్ ఫీల్డ్‌లో మంచి లాభాలు ఉన్నాయని తెలుసుకున్న కొందరు, ఫార్మసీ చేసిన వారికి ఎంతో కొంత ఇచ్చి అద్దెకు సర్టిఫికెట్ పొందుతున్నారు. ఆపై మెడికల్ స్టోర్ పెట్టి అక్కడ వ్యాపారం కోసం ఓ ఆర్‌ఎంపీని వెతికి వీరే గదికి అద్దె చెల్లించి మరీ సేవలను ప్రారంభిస్తారు. ఆపై కొన్నాళ్లు షాపులో ఉంటూ ఏ రోగానికి ఏ మందు ఇవ్వాలో తెలుసుకుని వీళ్లే ఆర్‌ఎంపీల అవతారం ఎత్తుతున్నారు. ఆర్‌ఎంపీ రానపుడు పేషెంట్లు వెనక్కి వెళ్లకుండా వీరే ఇంజెక్షన్ వేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఆపై ఆర్‌ఎంపీ ఉన్నా లేకున్నా మెడికల్ స్టోర్‌కు వ్యాపారం తగ్గకుండా చూసుకుంటున్నారు.

ఆర్‌ఎంపీల వద్దే సేవలు సైతం..

ఆర్‌ఎంపీలు డాక్టర్లుగా చెప్పుకుంటూ ఇంజెక్షన్లు వేయడమే తప్పు. అంతేగాకుండా బెడ్లు వేసి మరీ సెలైన్ పెట్టి యాంటీ బయాటిక్స్ వేస్తున్నారు. దీంతో పాటు ప్రైవేటు ఎంబీబీఎస్ డాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకుని వారిని రప్పించుకుని ఈసీజీ, నెబులైజర్, ఎక్స్‌రేలాంటి వాటిని సైతం అమర్చుకున్నారు. మరికొందరు ఏకంగా కాన్పులు, అబార్షన్లు చేస్తున్నారంటే ఎంత నిర్లక్ష్యమో అర్థం అవుతోంది.



ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందిన బాలిక తేజశ్రీని చూసి రోదిస్తున్న కుటుంబసభ్యులు



పలమనేరులోని ఆర్‌ఎంపీ క్లినిక్‌ను ధ్వంసం చేస్తున్న బాలిక బంధువులు

వైద్యం చేసేది..మందులు ఇచ్చేది ఆర్‌ఎంపీలే..

కొందరు ఆర్‌ఎంపీలు చికిత్స చేయడంతో పాటు వారే ఆపై మందులు కూడా అమ్ముతున్నారు. ముఖ్యంగా వీకోట, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాణి, చౌడేపల్లి తదితర మండలాల్లోని సరిహద్దు గ్రామాల్లో ఆర్‌ఎంపీలు ఎక్కువగా ఉన్నారు. మరికొందరు ఆర్‌ఎంపీలు వైద్యం చేయడం, మందులు ఇవ్వడంతో పాటు నాటు, పసరువైద్యం, మంత్రాలు వేయడం లాంటివి కూడా చేస్తూ అదనంగా డబ్బులు లాగుతున్నారు.

కమీషన్లకు కక్కుర్తి పడుతూ...

ఆర్‌ఎంపీలు వారివద్దకు వచ్చే పేషెంట్లను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే దానికి కమీషన్ అందుతుంది. ఇక రోగులను వివిధ రకాల టెస్ట్‌ల కోసం ల్యాబ్‌లకు, ఎక్స్‌రేలకు పంపినా వారి నుంచి ఒక్కో కేసుకు ఇంతా అన్ని కమీషన్ వస్తుంది. దీంతోపాటు ఆర్‌ఎంపీలకు మెడికల్ రెప్‌ల నుంచి బహుమతులు, టూర్స్, డిన్నర్స్ షరా మామూలే. ఆయా ప్రాంతాల్లోని కొందరు ప్రైవేట్ డాక్టర్లు ఏజెంట్లను పెట్టి మరీ ఆర్‌ఎంపీలతో డీల్ చేసుకుని రోగులను తమ వద్దకు పంపాలని ఎక్కువ కమీషన్ ఆఫర్ చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు నడిపే ప్రైవేట్ క్లినిక్‌లకు ఆర్‌ఎంపీలు కేసులు పంపుతుండడంతో వారిని ఈ డాక్టర్లే కాపాడుతున్నారనే మాట వినిపిస్తోంది.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం మేరకు ఆర్‌ఎంపీలు ప్రిస్కిప్షన్స్ రాయడం, ఇంజెక్షన్లు చేయడం, ఇన్‌పేషెంట్ సేవలు అందించరాదు. బీపీ, షుగర్ టెస్ట్‌లు, మందులషాపుల్లో వైద్యం చేయరాదు. ప్రథమ చికిత్సకు సర్టిఫికెట్ ఉండాలి. నిబంధనలు పాటించని ఆర్‌ఎంపీలపై దాడులు చేస్తున్నాం. మరింత పటిష్ట చర్యలు తీసుకుంటాం. - డా.ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

స్పెల్లింగ్ రానోళ్లంతా డాక్టర్లేనా?



కనీసం డాక్టర్ అనే పదానికి స్పెల్లింగ్ రాని వాళ్లు కూడా ఆర్‌ఎంపీల అవతారం ఎత్తి డాక్టర్లైపోయారు. పోనీ వారిచ్చే మందులపై వారికి అయినా అవగాహన ఉందా ? ఈ మధ్య ఆర్‌ఎంపీలే ఎక్కువైయ్యారు. దీనిపై ప్రభుత్వం ఏదైనా పాలసీని తీసుకొచ్చి కంట్రోల్ చేయాలి. - పుష్పరాజ్, రిటైర్డ్ టీచర్, పలమనేరు

శ్రీనివాస ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసి నోటీసు అంటించిన అధికారులు

పలమనేరు పట్టణంలోని టీకేస్ట్రీట్‌లో వెలసిన శ్రీనివాస ఆర్‌ఎంపీ క్లినిక్‌ను అర్బన్ మెడికల్ ఆఫీసర్ డా.ఆశా మంగళవారం తమ సిబ్బందితో కలిసి సీజ్‌చేసి దానికి నోటీసును అంటించారు. చిత్తూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్టు ఆమె విలేకరులకు తెలిపారు. పట్టణ సమీపంలోని నల్లగుండ్లపల్లికి చెందిన జయచంద్ర కుమార్తె తేజశ్రీ ఈ క్లినిక్‌లో చికిత్స వికటించి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డా.ఆశా మాట్లాడుతూ బీఫార్మసీ పూర్తిచేసిన రాణాప్రతాప్ అనే యువకుడు ఇక్కడ మెడికల్‌షాపుతో పాటు ఆర్‌ఎంపీ వైద్యం ఇందులో రెఫరల్ సేవలను సైతం నిర్వహిస్తున్నట్టు నిర్ధారించామన్నారు. అర్హత లేకుండా వైద్యం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆర్‌ఎంపీలుగా ఉంటూ 24 గంటలు అత్యవసర వైద్యమని బోర్డులు పెట్టీ మరీ రోగులను ఏమార్చడం బాధాకరమన్నారు. ప్రజలు క్వాలిఫైడ్ వైద్యుల వద్దకు మాత్రమే ట్రీట్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు దరఖాస్తులు

కాణిపాకం: ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ఏఎన్‌ఎం కోర్స్ ట్రైనింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతి దేవి తెలిపారు. ఇందుకు ఇంటర్ పాసైన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జనరల్ కేటగిరీకి 30 ఏళ్లలోపు వయసు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి 35 ఏళ్ల వయసు ఉండాలన్నారు. దరఖాస్తులను ww-wcfwap.nic.in అనే వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు డీడీ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ పేరిట రూ.50 డీడీ తీసి వచ్చే నెల 30వ తేదీలోపు చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్(కాణిపాకం): డయేరియా, డెంగీ వ్యాప్తిపై నిర్లక్ష్యం వద్దని, తక్షణం స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య కార్యాలయంలో మంగళవారం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా హెల్త్ కమిషనర్ జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో డయేరియా, డెంగీ, విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని తెలిపారు. కేసులు అధికమైతే ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు హాస్టల్, స్కూళ్లలో తరచూ తాగునీటి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చి.. అవే పరీక్షలు..!

విద్యాభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులను తీసుకురావాల్సిన కూటమి సర్కారు అనాలోచితంగా అడుగులేస్తోంది. గతంలో ఉన్న పరీక్షల పేర్లు మార్చడం, పథకాల పేర్లు మార్చడం తప్ప విద్యాభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నిర్వహించే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష పేరును ప్రస్తుతం సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షగా మార్చింది. జిల్లావ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ కాస్త సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా మార్పు
- ఆరు రోజుల పాటు పరీక్షలు
- టోఫెల్ పరీక్షకు కూటమి సర్కారు మంగళం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు ప్రయోజనం కలిగించేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు అమల్లోకి తీసుకొచ్చిన టోఫెల్ పరీక్షకు ప్రస్తుత కూటమి సర్కారు మంగళం పాడింది. అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్‌పై నీళ్లు చల్లుతోంది. చిత్తూరు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు సంబంధించి 2,982, తిరుపతి జిల్లాలో 3,063 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

చిత్తూరు జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,84,128 మంది, తిరుపతి జిల్లాలో 3,08,237 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును కూటమి సర్కారు మార్పు చేసింది. ఇంతవరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ (ఎస్ఏఎం)గా పేరు మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి 3 సార్లు నిర్వహించే యూనిట్ టెస్టులను ఇప్పటిదాకా రోజుకు రెండుచొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఈ సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను ప్రతిరోజు ఒక్కో సబ్జెక్టు చొప్పున ఆరు రోజులు కొనసాగిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఈ ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మార్కుల నమూనాలో ఎలాంటి మార్పు చేయలేదు.

పరీక్షల షెడ్యూల్ ఇదే..

ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 31 మండలాల్లోని స్కూళ్లకు ప్రశ్నపత్రాలు అందాయి.

చిత్తూరు, తిరుపతి జిల్లాల స్కూళ్ల వివరాలు

చిత్తూరు జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 2,064	ప్రాథమికోన్నత పాఠశాలలు 293
ఉన్నత పాఠశాలలు 625	1 నుంచి 10 వరకు విద్యార్థులు 2,84,128
తిరుపతి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు 2,108	ప్రాథమికోన్నత పాఠశాలలు 333
ఉన్నత పాఠశాలలు 622	1 నుంచి 10 వరకు విద్యార్థులు 3,08,237

'టోఫెల్'కు మంగళం

సర్కారు స్కూళ్లలో చదివే పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ సర్కారు ప్రవేశ పెట్టిన టోఫెల్ తరగతులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. గత నెల 15న విద్యాశాఖ విడుదల చేసిన 2024-25 అకడమిక్ క్యాలెండర్లో టోఫెల్ తరగతుల నిర్వహణపై ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. దీంతో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పాడినట్లేనని తేలింది.

పకడ్బందీగా ఏర్పాట్లు..



జిల్లావ్యాప్తంగా సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణకు గట్టి ఏర్పాట్లు చేశాం. మండలాలకు ప్రశ్నపత్రాలను చేరవేశాం. ఎంఈఓలు పరీక్షలు పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలి. అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయి.- దేవరాజు, డీఈఓ, చిత్తూరు

మేలు చేయాల్సింది పోయి..



కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లల్లో చదివే విద్యార్థులకు మేలు చేయాల్సింది పోయి, అన్యాయం చేస్తోంది. టోఫెల్ తరగతులను రద్దు చేయడం వల్ల కూటమి సర్కారుకు ఏమి ఒరుగుతుంది ?

- శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

అలసత్వం వహిస్తే వేటు తప్పదు

చిత్తూరు కలెక్టరేట్ : సంక్షేమ శాఖల అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖల అధికారులు, వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను సంక్షేమ శాఖల అధికారులు బాధ్యతతో చూసుకోవాలని చెప్పారు. వసతి గృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రతి నెలా విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలన్నారు.

భద్రత విషయంలో అలసత్వం వద్దు..

వసతి గృహాల్లో రాత్రి సమయంలో భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని కలెక్టర్ ఆదేశించారు. వార్డెన్లు జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఎప్పుడో వచ్చామా..త్వరగా వెళ్లిపోయామా అనే ధోరణి ఉన్నట్లైతే మార్చుకోవాలని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో వసతిగృహాల్లో భద్రత ఎలా ఉంటుందన్న విషయం పట్ల ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకుల, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాత్రి సమయాల్లో ఆకస్మికంగా వసతిగృహాలను సందర్శించాలన్నారు. బాలికల వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా, గురుకుల పాఠశాల డీసీఓ పద్మజ, మైనారిటీ శాఖ అధికారి చిన్నారెడ్డి, గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి


మృతి చెందిన పెయింటర్ గణపతి

బంగారుపాళెం: ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కరంటు షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. కీరమంద పంచాయతీ కామాక్షిపురానికి చెందిన సుబ్బయ్య కుమారుడు గణపతి(40) పెయింటర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో ఓ భవనానికి పెయింట్ వేస్తుండగా ప్రమాదవశాత్తు సమీపంలోని విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. సహచరులు గుర్తించి కరెంటు షాక్‌కు గురైన గణపతిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం


పుంగనూరు: మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన మద్యాన్ని జేసీబీ యంత్రంతో మంగళవారం ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల నేరాల్లో పట్టుబడిన 5,728 టెట్రాప్యాకెట్లు, 538 లీటర్ల కర్ణాటక మద్యం బాటిళ్లు, 230 లీటర్ల సారాను జేసీబీతో తొక్కించి, కాల్చివేశారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు పుంగనూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచి, రవాణాదారులను అదుపులోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, సెబ్ ఏఎస్పీ శ్రీధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువ పెంచేలా చర్యలు ఉండాలి


పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలతో సమాజంలో డాక్టర్లకు విలువ లేకుండా పోతుంది. కనీసం వారికి రక్షణ ఉండట్లేదనే దానికి నిదర్శనమే కోల్‌కతాతా సంఘటన. విలువ తగ్గిపోతుండడంతోనే పేరున్న డాక్టర్లు అమెరికా వెళ్తున్నారు. సొసైటీలో డాక్టర్లు, ఉపాధ్యాయులకు విలువ ఉండాల్సిన అవసరం ఉంది. భయం లేకుండా విధులు నిర్వర్తించేందుకు తగిన చట్టాలు తీసుకొచ్చి కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– ఝాన్సీ, జూనియర్ డాక్టర్, ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



చట్టాలను కఠినతరం చేయాలి


మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. మహిళలపై దాడులు చేయాలంటే భయపడే పరిస్థితులు కల్పించాలి. కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యోదంతం సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ప్రాణాలు కాపాడే డాక్టర్లపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడడం అత్యంత శోచనీయం. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటుగా సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– ఖాజీయా, జూనియర్ డాక్టర్, ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

చౌకగా పాలిష్..!

రాష్ట్రంలో ఎన్నికలు, ఆపై కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడం నేపథ్యంలో ఇటీవల వివిధ శాఖల్లో బదిలీలకు శ్రీకారం చుట్టారు. దీంతో అన్ని శాఖల్లోనూ ఒకింత స్తబ్దత నెలకొంది. ముఖ్యంగా విజిలెన్స్ దాడులనే మాటే లేదు. గతంలో ఉన్న అధికారులు కొత్త ప్రాంతాలకు వెళ్లారు. బదిలీపై వచ్చిన అధికారులు ఇంకనూ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడాన్ని అవకాశంగా తీసుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. పలమనేరు మీదుగా కర్ణాటకకు చేరి అక్కడ పాలిష్ చేసిన అనంతరం విదేశాలకు ఎగుమతి అవుతోంది.

- అక్రమ వ్యాపారులకు జేబులు నింపుతున్న రేషన్ బియ్యం
- ఇక్కడ కేజీ రూ.18కి కొని రూ.30తో అమ్మకం
- తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి భారీగా అక్రమ రవాణా
- అన్ని దారులు వయా పలమనేరు టు బంగారుపేట
- అక్కడి పాలిష్ మిల్లుల నుంచి విదేశాలకు చేరిక
- తాజాగా పలమనేరులో అక్రమ బియ్యం లారీ సీజ్
- నిద్రావస్థలో అధికార గణం

పలమనేరు: పేదలకు చేరాల్సిన చౌకబియ్యం అక్రమ మార్గాలలో తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి కర్ణాటలోని బంగారుపేటకు చేరి అక్కడినుంచి యథేచ్ఛగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. వ్యాపారంలో కిలోకు రూ.10 వరకూ మిగులుతుండడంతో అక్రమార్కులకు భలే మంచి చౌకబేరంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని కార్డుదారుల నుంచి కొందరు ఏజెంట్లు సేకరించిన బియ్యం, కొందరు రేషన్ డీలర్ల నుంచి సరుకు స్మగ్లర్లకు అందుతోంది. ఇలా సేకరణతో టన్నుల కొద్దీ బియ్యం రహస్య ప్రదేశాలకు చేరుతోంది. అక్కడి నుంచి అక్రమంగా పొరుగునే ఉన్న కర్ణాటకు లారీలు, ఇతర వాహనాలలో తరలిస్తున్నారు. అక్కడ పాలిష్ చేశాక, వాటిని రైస్ ప్యాకెట్లుగా సీల్ చేసి, వివిధ నౌకాశ్రయాలకు చేర్చి, ఏమాత్రం ఇబ్బంది లేకుండా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ దందా వెనుక కొందరు అధికారులు, రవాణా కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, బియ్యం వ్యాపారులు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు.. ఇలా పెద్ద నెట్‌వర్క్ ఉంది. తాజాగా ఆదివారం పలమనేరులో ఎస్పీ సమాచారంతో పోలీసులు అరగొండ నుంచి బంగారుపేటకు అక్రమంగా తరలుతున్న పదిటన్నుల చౌకబియ్యం వాహనాన్ని సీజ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు, ఆపై కొత్త ప్రభుత్వం నేపథ్యంలో ఇటీవల అధికారుల బదిలీలు సాగుతున్నాయి. దీంతో అన్ని శాఖల్లో స్తబ్దత నెలకొంది. ముఖ్యంగా విజిలెన్స్ దాడులు సైతం లేవు. దీన్ని అవకాశంగా చేసుకున్న అక్రమ బియ్యం వ్యాపారులు రెచ్చిపోతున్నారు.

బియ్యం సేకరణ ఇలా...

చౌకబియ్యం స్టాక్ పాయింట్ నుంచి ఎంఎల్ఎస్‌లకు రవాణా జరుగుతోంది. ఆపై చౌక దుకాణాలకు అక్కడి నుంచి సంచార వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులకు అందుతోంది. ఇలా చేరిన బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొందరు ఏజెంట్లు కిలో రూ.15 నుంచి రూ.18కు కొనుగోలు చేసి వాటిని బియ్యం స్మగ్లర్లకు లాభానికి అమ్ముతున్నారు. వీరు రహస్య గోడౌన్లలో పెట్టి ఆపై లోడ్లుగా మిల్లర్లకు పంపుతున్నారు. మరికొందరు బైక్‌లు, ఆటోలలో ఎలక్ట్రానిక్ తూకాలను తమ వెంట తీసుకెళ్లి కార్డుదారులు, చౌక దుకాణ ఏజెంట్ల నుంచి బియ్యాన్ని సేకరించి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా రెండు రకాలుగా జిల్లాలో చౌకబియ్యం రహస్య స్టాకు పాయింట్లకు చేరుతోందని తెలిసింది.

అక్రమ రవాణాలో పలువురు సూత్రధారులు

ఉమ్మడి జిల్లాలో 2,900 చౌక దుకాణాలకు నెలకు దాదాపు 18 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం రేణిగుంట ప్రధాన స్టాక్ పాయింట్‌కు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేస్తారు. సంబంధిత మండలాల నుంచి చౌక దుకాణాలకు చేరుతుంది. ఉమ్మడి జిల్లాలో 11లక్షల మంది కార్డుదారులకు సంచారవాహనాల ద్వారా బియ్యం పంపిణీ సాగుతోంది. ఇలా ఉండగా నెలకు 20 లారీల చౌక బియ్యం పక్కదారి పడుతున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో షాపులకు సరుకు తరలించే సూపర్‌వైజర్లు(వీఆర్‌ఏలు) గోడౌన్ డీటీలు, డీఎస్వో కార్యాలయంలో అలాట్‌మెంట్ సెక్షన్ సిబ్బంది, చివరకు ప్రధాన అధికారులు, చెక్‌పోస్టు సిబ్బంది, కొందరు పోలీసులకు సైతం ప్రతినెలా బియ్యం స్మగ్లర్ల నుంచి అందాల్సింది అందుతోందనే మాట వినిపిస్తోంది.


బంగారుపేటలోని స్పార్ టెక్స్ పాలిష్ మిల్లు


కర్ణాటకలోని బంగారుపేటకు చేరుతున్న చౌకబియ్యం(ఫైల్)


బంగార్‌పేట పాలిష్ ఫ్యాక్టరీలో ఎగుమతికి సిద్ధమైన పాలిష్డ్ ప్రీమియం రైస్ బస్తాలు

కిలోకు రూ.10 లాభం..!

ఇలా సేకరించిన బియ్యాన్ని స్మగర్లు రూ.18 కొని బంగార్‌పేటలోని పాలిష్ పరిశ్రమలకు కిలో రూ.30 వరకూ అమ్ముతున్నారు. దీంతో రవాణా పరంగా రూ.2 పోయినా కిలోకు నికరంగా రూ.10 వరకూ గ్యారెంటీగా మిగులుతోంది. ఆపై అక్కడి మిల్లుల్లో బియ్యాన్ని పాలిష్ చేసి, 25 కిలోల బ్యాగులుగా ప్యాకింగ్ చేసి విదేశాలకు హోల్‌సేల్‌గా బ్యాగు రూ. 1200తో కిలో రూ.48గా విక్రయిస్తారు. బంగారుపేట వ్యాపారులకు టాక్సులు, పాలిషింగ్, ప్యాకింగ్, విదేశాలకు రవాణా చార్జీలను కలుపుకుని మన చౌకబియ్యమే విదేశాల్లో ప్రీమియం వైట్ రైస్ పేరిట కిలో రూ.50 వరకూ అమ్ముడవుతోంది.

పలు నౌకాశ్రయాల నుంచి విదేశాలకు..

కర్ణాటకలోని బంగారుపేట, తుంకూరు మిల్లుల నుంచి రైస్ బ్యాగులు మంగళూరు నౌకాశ్రయం ద్వారా థాయ్‌లాండ్, వియత్నాం, మలేసియా, బర్మా, నైజీరియా, కెన్యా, బర్మా, కామెరూన్‌తో పాటు పలు ఆఫ్రికన్ దేశాలకు చేరుతోంది. ఈ చౌక బియ్యం రాకెట్‌లోని మూడు శాఖలకు చెందిన పెద్ద చేపలను పట్టుకుంటేగానీ వాస్తవాలు వెలుగుచూసే అవకాశం లేదు. అధికారులు చౌకబియ్యం అక్రమ రవాణాకు కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీస్ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారిస్తారా, లేదా? అనేది వేచిచూడాలి.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం

– కలెక్టర్ సుమిత్‌కుమార్


గోవులకు పూజ చేస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. కాణిపాకం ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో స్వామివారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే వీఐపీలకు, వృద్ధులకు, ఉభయ దారులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి దర్శనాలు కల్పిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రహదారులు, మరుగుదొడ్లు, ఆర్టీసీ బస్సు సౌకర్యాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, జిల్లా అగ్నిమాపక అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ ఈఈ వెంకటనారాయణ ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, ఎస్వీ కృష్ణారెడ్డి పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఉట్లోత్సవం

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు స్వామివారిని పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. టీటీడీ ఆధ్వర్యంలో యాదవ కులస్తులచే నిర్వహించిన ఉట్లోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్తులు, కార్వేటినగరం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి విహారం

ఉట్లోత్సవం సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలుడు మంగళవారం గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, శుద్ధి, తోమాల, అర్చన, పంచాంగ శ్రవణం, నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలుడిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి ఊరేగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఉట్టి కొడుతున్న యాదవ కులస్తులు

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మండల కేంద్రంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పవిత్రోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్, బంగారు పాళెం సీఐ లక్ష్మయ్యను వేకెంట్ రిజర్వు (వీఆర్)కు పంపారు. అలాగే చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు, శ్రీనివాసులును బంగారుపాళ్యంకు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కుప్పంను పట్టించుకోకపోవడం దారుణం

– సీఎం చంద్రబాబుపై మాజీ ఎంపీ చింతామోహన్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

కుప్పం: నలభై ఏళ్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు, తన సొంత నియోజకవర్గం కుప్పంను పట్టించుకోకపోవడం దారుణమని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. చిత్తూరు జిల్లా, కుప్పంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడూ అమరావతి, పోలవరం తప్ప కుప్పంపై దృష్టి సారించరా? అని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని కొన్ని రోజులు క్రితం చంద్రబాబు చెప్పారని, అయితే ఆయన సొంత నియోజకవర్గంలో 30 ఏళ్లుగా నిరుద్యోగులు నిత్యం రైలులో బెంగళూరుకు వెళ్లి కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారని, వీళ్ల పరిస్థితి ఆయనకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

30న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి టి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10గంటలకు ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మూడు ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై ఈ నెల 28న కలెక్టరేట్‌లో నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులు ఇకపై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వం జారీచేసే సర్వీస్ అంశాలు, బడ్జెట్ అంశాలు, పోస్టింగ్‌లు ఇకపై డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఓఐఆర్.ఏపీ.జీఓవి.ఇన్ (www. goirap.gov.in) వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని కలెక్టరేట్‌కు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టపాకాయల సీజ్

శ్రీరంగరాజపురం : అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయలను కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ సీజ్ చేశారు. సీఐ హనుమంతప్ప కథనం మేరకు.. మండలంలోని ములూరు గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.7.60 లక్షల విలువ చేసే టపాకాయలను రహస్య సమాచారం మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో అక్రమంగా సారా, బియ్యం, కలప, ఇసుక, గ్రావెల్ వంటివి అనుమతులు లేకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాణిపాకానికి వస్తుండగా..

- మొగిలి వద్ద జీపును ఢీకొన్న ఐచర్
- 15 మంది మహిళలకు గాయాలు
- బాధితులంతా అనంత వాసులే

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వద్ద మంగళవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌తో సహా 15 మంది మహిళలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లెకు చెందిన 14 మంది మహిళలు జీపులో(క్రూష్ వాహనం) ఉదయం చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వినాయకస్వామి వారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని మార్గమధ్యంలో మొగిలి వద్ద పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. దాంతో జీపు రహదారి పక్కన పొలాల వైపునకు దూసుకుపోయింది. ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న కృష్ణమ్మ, నిర్మల, లక్ష్మీదేవి, ధనలక్ష్మి, మల్లమ్మ, ఈశ్వరమ్మ, రామలక్ష్మి, వెంకటమ్మ, ఐశ్వర్య, లీలావతితో పాటు మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మొగిలి వద్ద ప్రమాదానికి గురైన జీపు

జీతాలు ఇవ్వాలని మద్యం షాపుల సిబ్బంది ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది

- చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలివ్వకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఏఐటీయూసీ, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోషియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, సెక్యూరిటీ సిబ్బందిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. 2 నెలలుగా వీరికి జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల్లో పనిచేస్తోన్న 15,000 మంది సిబ్బందికి, వారిపైన ఆధారపడిన కుటుంబాలకు అన్యాయం చేయకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు మంజూరు చేయాలని కోరుతూ డీఆర్వో పుల్లయ్యకు వినతి పత్రమిచ్చారు.

'పద్మావతి'లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు ఆరుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ చేతుల మీదుగా అడ్మిషన్ పత్రాలను అందుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి ఆల్ ఇండియా కోటా అడ్మిషన్ల ప్రక్రియ మొదలైందని వెల్లడించారు.అందులో పద్మావతి మహిళా వైద్య కళాశాలకు 26 సీట్లు కేటాయించారని చెప్పారు. వివిధ కేటగిరీల కింద అడ్మిషన్లు పొందిన వారిలో న్యూఢిల్లీ-1, జమ్మూ కాశ్మీర్-1, ఆంధ్రప్రదేశ్-1, కేరళ-2, రాజస్థాన్-1 విద్యార్థులు ఉన్నారన్నారు. క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించాలని అడ్మిషన్ పొందినవారికి సూచించారు. తల్లిదండ్రులకు, వృత్తికి గౌరవం తెచ్చేలా నడుచుకోవాలని కోరారు.


అడ్మిషన్ పత్రం అందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతిలో చిరుత కలకలం

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ప్రాంతాల్లో చిరుతపులి సంచారంపై కలకలం రేగింది. సెక్యూరిటీ సిబ్బంది స్పష్టంగా సమాచారం అందించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ అగ్రికల్చరల్ కళాశాల, వసతి సముదాయాలు, స్టాఫ్ క్వార్టర్స్, వెటర్నరీ వర్సిటీ ఆవరణలో విద్యార్థులు ఒంటరిగా తిరగరాదని, అత్యవసరమైతే గుంపులుగా బయటకు వెళ్లాలని సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో అగ్రికల్చరల్ కళాశాల, వెటర్నరీ వర్సిటీ మహిళా వసతిగృహాల పరిసరాలలో చిరుతను చూసి విద్యార్థినులు పరుగులు తీసినట్లు తెలిసింది.